క్లుప్తంగా

నేదురుమల్లికి అభినందన



జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వెంకటగిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానంపై గెలిచినందుకు వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలో అభినందించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ



నెల్లూరు(అర్బన్‌) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రీ వెరిఫికేషన్‌ సదరమ్‌ క్యాంపునకు వచ్చే దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, బధిరులు, వారి సహాయకులకు దాతల సహకారంతో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నుంచి చేపట్టారు. ఇందుకు దాతగా హెల్పింగ్‌ హ్యాండ్స్‌ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్‌ సహకరించారు. హాస్పిటల్‌ అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్‌ మడపర్తి శ్రీనివాసులు, శివాజి యూత్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

సర్వేపల్లి సమస్యలపై సమావేశం

నెల్లూరురూరల్‌ : సర్వేపల్లి నియోజకవర్గ సమస్యలపై కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం సమావేశం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్‌ ఆనంద్‌ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రజల నుంచి అందిన వినతులను వేగంగా పరిష్కరించాలని సూచించారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఆయనకు బెయిల్‌ రద్దు చేయాలని టీడీపీ నేత, నుడా చైర్మన్‌ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులను కించపరుస్తూ శాంతిభద్రతలను విఘాతం కలిగించేలా జగన్‌ మాట్లాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు సిటీ : రూరల్‌ ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద 19 మందికి రూ.23 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో విక్రమ్‌ నగర్‌

- వీధిలైట్లు లేక అవస్థలు
- చీకట్లో పాములు, కుక్కలు, పందుల సంచారం

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్‌ పరిధిలోని ప్రతి వీధిలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ సూర్యతేజ అధికారులను అనేకసార్లు ఆదేశించారు. అయినా రూరల్‌ నియోజకవర్గంలోని కొన్ని శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు లేకపోవడంతో అక్కడి ప్రజలు రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు.

స్తంభాలున్నా..

నగరంలోని 26వ డివిజన్‌, అయ్యప్పగుడి సమీపంలో ఉన్న విక్రమ్‌నగర్‌లో స్తంభాలున్నా వాటికి విద్యుత్‌ దీపాలను అమర్చలేదు. దీంతో రాత్రయితే వీధులన్నీ చీకటిమయం అవుతోంది. ఇక్కడి ప్రాంతంలో రాత్రిపూట నెలకొంటున్న అంధకారం కారణంగా స్థానికులు రాకపోకలు సాగించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. విక్రమ్‌నగర్‌ ప్రాంతంలో పాములు, కుక్కలు, పందుల సంచారంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పగలంతా ఇక్కడి వారు తమ పనులను సాఫీగా చేసుకున్నప్పటికీ సాయంత్రం అయితే పాముల సంచారంతో నిద్రలేమి రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మరోవైపు కుక్కలు, పందుల సంచారంతో చిన్నారులు, మహిళలు వీధిలోకి రావాలంటేనే జంకుతున్నారు. గత కొంత కాలంగా విక్రమ్‌నగర్‌లో వీధిలైట్లు లేని విషయాన్ని కార్పొరేషన్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి విక్రమ్‌నగర్‌లో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వీధిలైట్లు లేని విక్రమ్‌ నగర్‌లోని ఓ వీధి



రాత్రి వేళలో పామును పట్టుకున్న స్థానికులు

వీధిలైట్లను ఏర్పాటు చేయాలి



విక్రమ్‌ నగర్‌లో వీధిలైట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. మా ప్రాంతంలో పాములు, కుక్కలు, పందులు సంచారంతో భయపడాల్సి వస్తోంది. సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడాల్సిందే. విక్రమ్‌నగర్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– షేక్‌.నాగూర్‌, స్థానికుడు

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తానని, ఏ సమస్యలు వచ్చినా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముదిరాజ్‌ విభాగం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌ ముదిరాజ్‌ అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన విష్ణువర్ధన్‌ను నగరంలోని మైపాడుగేటు వద్ద గల ముదిరాజ్‌ మహాసభ కార్యాలయంలో గురువారం సంఘ పెద్దలు, మహిళలు హాజరై సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ప్రాతిపదికన ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఒక ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, రాజధానిలో ముదిరాజ్‌ కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్‌, ఐనూరు, క్రాంతి ముదిరాజ్‌, మురళీకృష్ణ ముదిరాజ్‌, వెంకటేశ్వర్లు ముదిరాజ్‌, కొర్ల శివ ముదిరాజ్‌, రెబ్బల హరి ముదిరాజ్‌, శ్రీను ముదిరాజ్‌ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంఎస్‌ఎంఈ మాజీ డైరెక్టర్‌ పాశం శ్రీనివాస్‌ జన్మదినం సందర్భంగా నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న గీతామయి వృద్ధుల ఆశ్రమంలో నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. తొలుత ఆశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేశారు. పాశం తిరుపతి, వెంకటేష్‌, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు పాల్గొన్నారు.

గ్రీన్‌ బోర్డులు, కలర్‌ ప్రింటర్‌ వితరణ



నెల్లూరు (టౌన్‌) : స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్‌ ప్రాథమిక పాఠశాలకు భారత పెట్రోలియం కార్పొరేషన్‌ లిమిటెడ్‌, కృష్ణపట్నం పైపులైన్స్‌ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రీన్‌ బోర్డులు, కలర్‌ ప్రింటర్‌, ఫ్యాన్లు, కుర్చీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్‌ లీడర్‌ ఉమారాణి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాన్ని అందంచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్‌ మేనేజర్‌ ప్రమోద్‌కృష్ణన్‌, మేనేజర్‌ నరసింహారావు, అసిస్టెంట్‌ మేనేజర్‌ బీమ్లానాయక్‌, హెచ్‌ఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు

నెల్లూరు (టౌన్‌) : వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి సకాలంలో పాఠ్యపుస్తకాలను అందించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ విద్యార్థి మిత్ర పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూల్‌ బ్యాగులు, మూడు జతల యూనిఫామ్‌ క్లాత్‌, బెల్టు, బూట్లు, సాక్సులు, డిక్షనరి, వర్క్‌బుక్‌ను అందజేయనున్నట్లు చెప్పారు.

డయల్‌ యువర్‌ డీఎం–1 నేడు

నెల్లూరు సిటీ : ఆర్టీసీ డిపో–1 పరిధిలో సమస్యలు, సూచనలను తెలిపేందుకు శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం–1 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్‌ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందన్నారు. 99592 25641 నంబర్‌కు ఫోన్‌ చేయవచ్చన్నారు.

ఆశా వర్కర్ల సదస్సు రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : నేషనల్‌ హెల్త్‌ మిషనరీ స్కీమ్‌(ఎన్‌హెచ్‌ఎం) ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ సాధించిన విజయాలపై శనివారం నగరంలో సదస్సు ఉంటుందని యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ గురువారం తెలిపారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో నిర్వహించే సదస్సుకు యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హాజరు కానున్నారని, జిల్లాలోని ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

13న సాహితీ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం) : పుర మందిరంలోని ఏసీ హాల్లో ఈనెల 13న సాహితీ పురస్కారాల ప్రదానం ఉంటుందని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్‌ అధ్యక్షుడు నారాయణరావు గురువారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు, సత్కారాలు జరుగుతాయన్నారు.

కర్నూలుకు ఏసీ బస్సును ఏర్పాటు చేయండి

నెల్లూరు సిటీ : వేసవి నేపథ్యంలో నెల్లూరు–కర్నూలు మధ్య ఏసీ బస్సును ఏర్పాటు చేయాలని నగరానికి చెందిన ఎస్‌.సాయి యామిని కోరారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 'డయల్‌ యువర్‌ డీఎం–2' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ శివకేశవ్‌యాదవ్‌ ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. ఒక్క ఫోన్‌ కాల్‌ మాత్రమే రావడంతో ఆమె సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

నెల్లూరురూరల్‌ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి, వారి బంగారు భవితకు బాటలు వేయండి' పోస్టర్‌ను కలెక్టర్‌ ఆనంద్‌ గురువారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జేసీ కార్తీక్‌, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమవంతు కృషి చేస్తామని మాజీ కౌన్సిలర్‌ ఉదయగిరి నర్సింహులు గౌడ్‌, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి గురువారం తెలిపారు. ఈ మేరకు వారు నగరంలో గురువారం మాట్లాడారు. విగ్రహ ఏర్పాటుకు తామే కాకుండా అనేక మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ నాయకులను కలుపుకుని విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వివిధ ఆలయాల్లో చైత్రమాసం సందర్భంగా బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం స్వామి, అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు.

⇨ నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి పురుషామృగ వాహనసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా చిలకపాటి రామాంజనేయులు– జయమ్మ దంపతులు వ్యవహరించారు. ఈఓ బి.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

⇨ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో స్వామివారికి సింహ వాహన ఉత్సవం, రాత్రి చంద్రప్రభ అలంకారోత్సవాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పెసల జగదీష్‌, దుత్తలూరు లక్ష్మీనరసమ్మ, అమరలింగేశ్వరరావు, సుదర్శన్‌రావు, వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈఓ జీసీహెచ్‌ దర్గయ్య పాల్గొన్నారు.

⇨ సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి గిన్నెభిక్ష, గంధర్వ వాహన ఉత్సవం గావించారు. ఉభయకర్తలుగా బి.రామకృష్ణ, వాకిచర్ల వీరమాధవ్‌ వ్యవహరించారు. ఈఓ పి.రఘురామయ్య పాల్గొన్నారు.

⇨ మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో యాళి, చంద్రప్రభ అలంకారోత్సవాలు జరిపించారు. ఉభయకర్తలుగా పుట్టా నరేంద్రరెడ్డి, ఆర్కాట్‌ తారాచంద్‌, డాక్టర్‌ ఇస్కా విజయకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌ చంద్రమౌళిరెడ్డి, ఈఓ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

⇨ వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో సీతారామలక్ష్మణ హనుమంత స్వామికి తిరుమంజనం, అభిషేకం, ఊంజల్‌సేవ, తిరుచ్చి సేవ, ఏకాంతసేవ గావించారు.

⇨ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో గిన్నెభిక్ష, గరుడ వాహనసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా కంపరాజు శ్రీనివాసులురాజు, పేరకం శ్రీనివాసరావు, సాల్లేటి వెంకటసత్యసాయికార్తీక్‌, చిరమన రాజేశ్వరమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్‌, హనుమంతరావు పాల్గొన్నారు.

⇨ రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామికి శేష పాన్పు, నగరోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పీవీ ప్రసన్నరెడ్డి– స్వర్ణలత దంపతులు వ్యవహరించారు.



నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..



బాలాజీనగర్‌లోని సీతారాముల మందిరంలో..



మూలాపేట వేణుగోపాలుని ఆలయంలో..



రామ్‌నగర్‌లోని రామక్షేత్రంలో..



కోదండరాముని దేవస్థానంలో..

20న పాటలు, డ్యాన్స్‌ పోటీలు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : కేతా అంకులు మెమోరియల్‌ ట్రస్ట్‌ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని పురమందిరంలో ఈనెల 20వ తేదీన సినీ, లలిత సంగీత, శాస్త్రీయ, వెస్టర్న్‌ డ్యాన్స్‌, సినీపాటల పోటీలు జరుగనున్నాయని ట్రస్ట్‌ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. స్థానిక నర్తకి సెంటర్‌లో వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలతో పాటు శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. డేగల సాంబశివరావు ఆధ్వర్యంలో 100 మంది బాలలతో నృత్య ప్రదర్శనలు జరుగనున్నాయన్నారు. ఔత్సాహిక కళాకారులు 15వ తేదీలోగా 77299 42543 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు రఘురామిరెడ్డి, మీరా, అమానుల్లాఖాన్‌, షఫీ పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలకు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి మాట్లాడుతున్న కలువాయి వాసులు

నెల్లూరు(అర్బన్‌) : కలువాయిలో ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించిన రేవూరి యానాదయ్య అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు గురువారం కలెక్టర్‌ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కలువాయికి చెందిన ఢిల్లీ రమాదేవి, సత్తు విజయమ్మ, అనూష తదితరులు మాట్లాడుతూ 2019లో 1930–1 సర్వే నంబర్లలో 2.50 సెంట్ల చొప్పున 18 మందికి ఇంటి స్థలాలను అప్పటి తహసీల్దార్‌ నాగరాజు నాటి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారన్నారు. అయితే ఫోర్జరీ సంతకాలతో 2008లోనే ఆ స్థలాలు తమకు ఇచ్చినట్టుగా యానాదయ్య ఉరఫ్‌ కండే రాయుడు చెబుతూ తమను ఇబ్బంది పెడుతున్నాడన్నారు. ఆ ఫోర్జరీ సంతకాలను పరిశీలిస్తే 2008లో తహసీల్దార్‌ ఏసుదాసు సంతకం ఉందని, అయితే ఏసుదాసు అప్పటికే పదవీ విరమణ చేసి ఉన్నందున పట్టాలు ఇచ్చే అవకాశం లేదని తెలిపారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు

నెల్లూరు సిటీ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని శిశు సంక్షేమ శాఖ సెక్టార్‌ సూపర్‌వైజర్‌ స్వరూప అన్నారు. రూరల్‌ పరిధిలోని అంబాపురం గ్రామీకనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ గర్భం దాల్చిన తరువాత కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజులా, పద్మ, జ్యోతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్‌

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : వేసవిలో రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పనులను యుద్ధప్రాతిపదికన చేయాలని ఎస్పీడీసీఎల్‌ జిల్లా ఎస్‌ఈ విజయన్‌ ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌ భవన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మరమ్మతులకు గురైన 5,810 ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఈఈ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఈఈ అల్తాఫ్‌ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలంటూ..

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): పెంచిన వంట గ్యాస్‌, పెట్రోలు, డీజిల్‌ ధరలు తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ సీపీఎం నెల్లూరు నగర, రూరల్‌ కమిటీల ఆధ్వర్యంలో గురువారం గాంధీబొమ్మ సెంటర్‌ నుంచి వీఆర్సీ సెంటర్‌ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలని డిమాండ్‌ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ పెట్రోలు, డీజిల్‌, గ్యాస్‌ ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే విద్యుత్‌ చార్జీల పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారన్నారు. గ్యాస్‌పై పెంచిన రూ.50లను ప్రభుత్వమే భరించాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, మస్తాన్‌బీ, కొండా ప్రసాద్‌, నాగేశ్వరరావు, పెంచల నరసయ్య, అబ్దుల్‌ అజీజ్‌, సూర్యనారాయణ తదిదరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న గుంజి దయాకర్‌

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు వడ్డెరలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్‌ గుంజి దయాకర్‌ డిమాండ్‌ చేశారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్‌ వద్ద ఉన్న సీఐటీయూ కార్యాలయంలో సంఘ రాష్ట్ర స్థాయి సమావేశం చల్లా వెంకటయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్‌ మాట్లాడుతూ వృత్తిరీత్యా మృతిచెందిన వడ్డెరలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వృత్తుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. వడ్డెరలకు కంకర క్వారీలు, గ్రావెల్‌ గుట్టలు, ఇసుక, మైనింగ్‌ గనులను కేటాయించాలన్నారు. జూన్‌ 7, 8న వడ్డెర వృత్తిదారుల తొలి రాష్ట్ర మహాసభను నెల్లూరులో నిర్వహించనున్నామన్నారు. అనంతరం చల్లా వెంకటయ్య, ఉప్పు మస్తానయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకటయ్య, రత్తయ్య, బాలవెంకటేశ్వర్లు, శివనాగ, కృష్ణ వేణి, కనకదుర్గ, నాగార్జున, శ్రీకాంత్‌, పవన్‌కుమార్‌, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

సోలార్‌ వినియోగం పెంచాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : ఉమ్మడి జిల్లాలో సోలార్‌ విద్యుత్‌ వినియోగం పెంచేలా దృష్టి సారించాలని ఎస్పీడీసీఎల్‌ జిల్లా ఎస్‌ఈ విజయన్‌ అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సోలార్‌ విద్యుత్‌ను వినియోగిస్తున్న వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం సాధారణ ప్రజలతో మాట్లాడుతూ ఒక్కసారి పెట్టుబడితో ఉచిత విద్యుత్‌ను అందుకోవచ్చని తెలియజేశారు. జిల్లా నోడల్‌ ఆఫీసర్‌ శేషాద్రిబాలచంద్ర, టౌన్‌ ఈఈ శ్రీధర్‌, డీఈఈ అశోక్‌, ఏఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి



నందీశ్వరునికి అభిషేకం

నెల్లూరు(బృందావనం) : త్రయోదశి సందర్భంగా రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోషకాల పూజ, నందీశ్వరునికి అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి, నందీశ్వరునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈఓ ఎ.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.